# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు.
- ❖ రాష్ట్రంలో 3 శాసనమండలి స్థానాలకు రేపు పోలింగ్ జరగనుంది.
- ❖ శివాలయాలలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.
- ❖ తూర్పు గోదావరి జిల్లా తాడిపూడిలో ఈరోజు గోదావరి నదిలో స్నానానికి దిగి ఐదుగురు యువకులు మృతి చెందారు.
- ❖ మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా శివాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పూజలు నిర్వహిస్తున్నారు.

==================

పవిత్రమైన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. నదీ స్నానాలు, ఉపవాసం, జాగరణ దీక్షలను అత్యంత నిష్ఠతో ఆచరిస్తున్న భక్తులకు ఆ శంకరుడు సకల శుభాలను, ఆయురారోగ్యాలను అనుగ్రహించాలని కోరుకుంటున్నానని సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటున్న భక్తులు అందరూ జాగ్రత్తలు పాటించాలని, భక్తి శ్రద్ధలతో పరమశివుని పూజించుకోవాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు.

==================

రాష్ట్రంలో మూడు శాసనమండలి స్థానాలకు రేపు పోలింగ్ జరగనుంది. ఉమ్మడి గుంటూరు - కృష్ణా, తూర్పు - పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు, అలాగే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికకు

పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఉమ్మడి తూర్పు - పశ్చిమ గోదావరి పట్టభద్రుల స్థానానికి అత్యధికంగా 35 మంది, కృష్ణా - గుంటూరు స్థానానికి 25 మంది, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ స్థానానికి 10 మంది పోటీలో ఉన్నారు. ఉమ్మడి గుంటూరు - కృష్ణా పట్టభద్రుల నియోజకవర్గం, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ప్రస్తుత ఎమ్మెల్సీలు కే.ఎస్.లక్ష్మణరావు, పాకలపాటి రఘువర్మ మరోసారి పోటీలో నిలిచారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి పోలింగ్ లో 22,493 మంది ఓటర్లు, ఉమ్మడి ఉభయ గోదావరి పట్టభద్రుల పోలింగ్ లో 3,14,984, ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల పోలింగ్ లో 3,47,116 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొనున్నారు.

===================

రేపు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లాలో ప్రత్యేక నిషేధ ఆంక్షలు విధించామని జిల్లా ఎన్నికల అధికారి.. కలెక్టర్ స్వప్న ఎల్ దినకర్ పుడకర్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... జిల్లాలో 31 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరపటానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

ఇదిలా ఉండగా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి పోలింగ్ ప్రక్రియ ఎటువంటి ఒత్తిళ్లకు లోను కాకుండా సజావుగా నిర్వహించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. ఈ రోజు ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు.

===================

మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రంలోని 30 ప్రముఖ శివాయాల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా విస్తృతంగా ఏర్పాట్లు చేశామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. నెల్లూరులోని శ్రీ మూలస్థానేశ్వర స్వామి వారిని ఆయన ఈరోజు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.... సామాన్య భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆలయ పాలకవర్గాలకు.. అధికారులకు సూచనలు ఇచ్చామన్నారు. కొన్ని ఆలయాలలో దేవాదాయ శాఖ నుంచి ప్రత్యేకంగా అధికారులను పంపి అక్కడ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 38 సెకన్లు)

===================

తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడిలో గోదావరిలో స్నానానికి దిగి ఐదుగురు యువకులు మృతి చెందారు. మహాశివరాత్రి సందర్భంగా ఈ రోజు తెల్లవారుజామున 11 మంది యువకులు గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లారు. నదిలో లోతుగా ఉన్న ప్రదేశాన్ని గుర్తించకపోవడంతో వారిలో ఐదుగురు యువకులు నీటిలో మునిగిపోయారు. ఈ క్రమంలో ఒకరినొకరు రక్షించుకునే ప్రయత్నంలో ఆ ఐదుగురూ గల్లంతై ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని గజఈతగాళ్ల సాయంతో గల్లంతైన యువకుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదం పట్ల రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి మృతుల కుటుంబాలకు సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

విరామం

===================

ఉమ్మడి గుంటూరు-కృష్ణా పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల జరగనున్న నేపథ్యంలో రేపు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా జిల్లాలో ఓటు హక్కు కలిగిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సెలవు ను ఎన్నికల సంఘం ప్రకటించినట్లు కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డి.కే. బాలాజీ తెలిపారు. ఓటరుగా నమోదు

చేసుకున్నవారికి ఆయా యాజమాన్యాలు అనుమతులు ఇవ్వడం, సర్దుబాటు  చేయడం వంటి వెసులుబాటు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

===================

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా శివాలయాల్లో భక్తులు భారీ సంఖ్యలో పూజలు నిర్వహించారు. తిరుపతి జిల్లాలోని ప్రముఖ వాయులింగక్షేత్రం శ్రీకాళహస్తిలో తెల్లవారుజామున 3 గంటల నుంచే స్వామి వారి దర్శనానికి భక్తులను అనుమతించారు. వివిధ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈరోజు ఉదయం ఇంద్రవిమానం సేవలను వైభవంగా నిర్వహించారు. ఇదిలా ఉండగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

నంధ్యాల జిల్లాలో ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలం ఆలయానికి భక్తులు ఈరోజు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. నిన్న రోజు రాత్రి నుంచే భారీగా భక్తులు ఆలయానికి చేరుకున్నారు. పాతాళ గంగ స్నానఘట్టాల వద్ద భక్తులు పెద్ద ఎత్తున పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. అనంతరం స్వామి వరి దర్శనానికి వెళ్తున్నారు. తెల్లవారుజామున 2.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వరకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం 5.30 గంటలకు స్వామి, అమ్మవార్లకు ప్రభోత్సవం కన్నుల పండుగగా జరిపారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పంచారామ క్షేత్రం దాక్షారామ శ్రీ మాణిక్యాంబా సమేత శ్రీ భీమేశ్వర స్వామి వారి ఆలయానికి పేకువజాము నుండి భక్తులు పెద్ద ఎత్తున పోటేత్తారు. అదే విదంగా  జిల్లాలోని నక్క రామేశ్వరం, ముక్తేశ్వరం, మురమళ్ల, శివకోటి, అమలాపురం శైవ అలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

శ్రీకాకుళం జిల్లా శ్రీముఖలింగేశ్వర స్వామీ వారి ఆలయంలో శివరాత్రి  ఉత్సవాల పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విశాఖపట్నం పోలీస్ రేంజ్ డీఐజీ  గోపీనాథ్ జట్టి, జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి అక్కడ బందోబస్తు పరిశీలించారు.

అలాగే పల్నాడు జిల్లాలోని ప్రసిద్ద శైవక్షేత్రం, కోటప్పకొండ  త్రికోటేశ్వరస్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ  రోజు  తెల్లవారుజాము 2 గంటలకు బిందెతీర్థంతో శ్రీత్రికోటేశ్వర స్వామికి తొలిపూజ ప్రారంభమైంది. తొలిపూజ మహోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఇక్కడి ప్రత్యేక ప్రసాదమైన అరిసెలను 75 వేలకు పైగా తయారు చేసి భక్తుల కోసం సిద్ధం చేశారు. కోటప్పకొండ ఆలయ ప్రధాన అర్చకలు స్వాములు కొండ కావూరి వెంకటప్పయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ..

(వాయిస్ 37 సెకన్లు)

===================

విజయనగరం జిల్లా ఎస్.కోట మండలంలో నాలుగు కొండశిఖర గిరిజన గ్రామాల్లో వైరల్ జ్వరాలపై కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఈ రోజు తక్షణ చర్యలను చేపట్టినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జీవనరాణి చెప్పారు. కురిడి, గూనపాడు, శనగపాడు, రాయిపాలెం గిరిజన గ్రామాలకు రెండు ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను పంపించి జ్వరపీడితులను గుర్తించి, వారికి గ్రామంలోనే వైద్య సహాయం అందించే ఏర్పాట్లను చేశామని తెలిపారు. ఎస్.కోట ప్రాంతీయ ఆసుపత్రిలో 11 మందిని చేర్పించి చికిత్స అందిస్తున్నామని స్పష్టం చేశారు.

===================

ప్రభుత్వం సుపరిపాలనలో ప్రజలకు సంక్షేమ ఫలాలు సంతృప్తికరంగా అందాలని మహిళా, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆకాక్షించారు. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలంలో శ్రీ పారమ్మతల్లి అమ్మవారిని ఈ రోజు మంత్రి దర్శించుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... ప్రజలందరిపై శివుని అనుగ్రహం ఉండాలని అన్నారు.

===================
===================